# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సుస్థిర అభివృద్ధి నమూనాలో ప్రభుత్వ ప్రవేటు ప్రజల భాగస్వామ్యం-పీపీపీ ప్రాజెక్టులను అమలు చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నుంచి 16 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నామన్న మంత్రి నిమ్మల రామానాయుడు.**

3. **సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులకు భద్రతా ప్రమాణాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.**

4. **పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్న మంత్రి కొలుసు పార్థసారథి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం-పీపీపీ ప్రాజెక్టులు, ఆర్థిక శాఖ పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పీపీపీ విధానంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతి, ప్రభుత్వ వ్యయం వంటి అంశాలను సమీక్షించారు. పోర్టులు, షిప్‌యార్డులు, విమానాశ్రయాలు, పర్యాటక ప్రాజెక్టులతో పాటు మొత్తం 260 ప్రాజెక్టులు పీపీపీ కింద చేపట్టినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సుస్థిర అభివృద్ధి నమూనాలో పీపీపీ ప్రాజెక్టులను అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం సాయంత్రం వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వద్ద నిర్వహించే జగన్నాథ రథయాత్రలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

-------------------------

రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలను ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో జంతు ప్రదర్శన శాలల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వైల్డ్‌లైఫ్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు తెలిపారు. ఆసియాలోనే మూడు వేల ఎకరాల విస్తీర్ణంతో తిరుపతి జంతు ప్రదర్శన శాల అతి పెద్దదని పేర్కొన్నారు. టీటీడీ సహకారంతో దీనిని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ప్రభుత్వానికి మంచి ఆదాయం సమకూరుతుందని అన్నారు. అంతకుముందు శాసనసభాపతి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

-------------------------

గుంటూరు జిల్లా సీతానగరం వద్ద కృష్ణా పశ్చిమ డెల్టాకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ నీటిని నిన్న విడుదల చేశారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నుంచి 16 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నామని వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ సమీపంలో సముద్రంలో ఈరోజు చేపల వేటకు వెళ్లిన ఒక మత్స్యకార బోటు అలల ఉద్ధృతికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడగా, గాయపడిన ఇద్దరికి ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ ఘటనపై మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులకు భద్రతా ప్రమాణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు, అలల ఉద్ధృతిపై ముందస్తు హెచ్చరికలు తప్పనిసరిగా మత్స్యకారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే లైఫ్ జాకెట్లతో పాటు ఇతర భద్రతా పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

---------------------------

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు "పోలవరం-మోదీ వరం" పేరుతో పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్రను ఈరోజు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, పార్లమెంట్ సభ్యురాలు డి. పురందేశ్వరి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు యాత్రలో పాల్గొన్నారు. యాత్రకు ముందు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, దానిని పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ప్రాజెక్టు కోసం ఇప్పటికే కేంద్రం 20 వేల 750 కోట్ల రూపాయలను విడుదల చేసిందని, పనుల పూర్తికి అవసరమైన అదనపు నిధులను కూడా అందిస్తుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలని ప్రకాశం-మార్కాపురం జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా సమీక్ష, సమన్వయ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామితో కలిసి రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. అటవీ, తాగునీటి సరఫరా, నీటిపారుదల వంటి అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ... ఎల్‌నినో ప్రభావం ఉన్నందున తాగు, సాగునీటి కొరత తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా జిల్లా ప్రజలకు నీరు త్వరగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

---------------------------

పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి నిన్న పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, కంప్రెస్డ్ బయోగ్యాస్ –సీబీజీ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీబీజీ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని మంత్రి పార్థసారథి తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 22న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మురుగునీరు గోదావరిలో కలవకుండా శుద్ధి కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

---------------------------

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఎక్సలెన్సీ సెంటర్లలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సంఘం కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటీ–జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు రాష్ట్రంలో మూడు ఎక్సలెన్సీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2026 పదవ తరగతి పరీక్షల్లో 85 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌కు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు రెండో సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రేపటి నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 24వ తేదీ వరకు పంపవచ్చు.

=====================